లలిత సంగీతం — రేడియో

బాలాంత్రపు రజనీకాంతరావు

లైట్ మ్యూజిక్ అనే ఇంగ్లీషుమాటకు పర్యాయ పదాలుగా లఘు సంగీతమనీ, సరళ సంగీతమనీ, లలిత సంగీతమనీ ఈనాడు వ్యవహారిస్తున్నాము. క్లాసికల్ మ్యూజిక్‌ను ప్రౌఢసంగీతం అంటాము. లలితసంగీతమూ ప్రౌఢసంగీతమూ కూడా శాస్త్రీయ సంగీతంకావచ్చు. ప్రౌఢ సంగీతం అందులో ఆరితేరిన విద్వాంసులకీ, ఆ విషయంలో కృషిచేస్తున్న విద్యార్థులకీ, విశేష శ్రవణానుభవంగల వారికీమాత్రం ఆనందించడానికి వీలుగాఉంటుంది కాని, అధిక సంఖ్యాకులైన సామాన్య జనానికి అంతగా అందుబాటులో ఉండదు. దీనికి ముఖ్యకారణం ఏమిటంటే ప్రౌఢ సంగీతంలో కళాప్రదర్శన మాత్రమే కాక విద్వద్రహస్యాలను విస్తరించి, ప్రస్తరించి చూపే ప్రయత్నం, ఆ విద్యారహస్యాలలో కృషివల్లనైనా, శ్రవణంవల్లనైనా పరిచయంఉన్న అల్ప సంఖ్యాకులకేకాని, మిగిలిన సామాన్య జనం అందరికీ అంతగా రుచించకపోవడమే. వారికి కావలసినదల్లా ఆపాతమధురమై, తాము తిరిగి పాడుకోవడానికి వీలుగా వెంటనే పట్టుబడగల తేలిక సంగీతం. ఈ తేలికతనం ప్రౌఢంకాకుండా ఉండేటంత వరకేగాని, చవుకబారు అనిపించేటంతవరకూ పోకూడదు. దేశంలోని ఆయాప్రాంతాలలో పాడుకొనిపోయి అనాదిసిద్ధంగా వస్తున్న సంప్రదాయములు ఆధారముగా నిత్యనూతన కల్పనావకాశములతో ఆకర్షణీయమై ఉండాలి లలిత సంగీతం.

ఈ నిర్వచనాన్నిబట్టి ఉత్తర హిందూస్థాన ప్రాంతాలలో ఉత్తరాది సంప్రదాయాలను దక్షిణహిందూస్థాన ప్రాంతాలలో దక్షిణాది సంప్రదాయాలనూ అనుసరించే ఉంటోందా లలిత సంగీతం అనే ప్రశ్న వస్తుంది. చారిత్రకపరిస్థితుల ప్రాబల్యంవల్ల అలా ఉండటంలేదు. భారత జాతీయతకు మూలపీఠాలైన గ్రామాలలోని ఆయారాష్ట్రప్రజల భావాలకు జాతులకు అనుగుణమైన జానపదగేయరీతులు లలితసంగీతాలే అనిపించుతుంటాయి. సంగీత శాస్త్రరచన క్రమపరిణామంలో ఆయాలక్షణకర్తలు తమతమ ప్రాంతపు జానపద ఫణితులకు దేశమునుబట్టీ, ప్రజనుబట్టీ, కొత్తరాగములుగా పేరులుపెట్టి శాస్త్రములో చేర్చుకొంటూ రావడమే కాకుండా దేశంలోని ఒక ప్రాంతంవారు మరొక ప్రాంతపు ఫణితులను రాగాలనుకూడా స్వీకరిస్తూవచ్చారు. అందుచేతనే ఉత్తరాది సంగీతములోనూ ప్రౌఢసంగీతములోనే కాకుండా లలితసంగీత రీతులలోకూడా పరస్పరమూ అటువంటి ఇచ్చిపుచ్చుకోవడాలు చాలా జరిగాయి. ఈనాటిలలితసంగీత సంప్రదాయాలలో ప్రాంతీయ వైవిధ్యాలు క్రమంగా సమసిపోతూ భారతదేశమంతటా ఒకేవిధమయిన సంప్రదాయం ఏర్పడబోతోంది.

సంగీతంలో ప్రౌఢమనీ లలితమనీ చెప్పుకొంటున్న విభజనం ఈనాటిదికాదు. "మార్గదేశి విభాగేన సంగీతం ద్వివిధం మతా" అని నాట్య శాస్త్రకర్త అత్యంత ప్రాచీనుడైన భరతముని నిర్దేశించాడు. అంటే ప్రౌఢమై శాస్త్రకర్తలు నిర్దేశించిన లక్షణం ప్రకారం సాగేకళ సంగీతమైనా, నాట్యమైనా, "మార్గ" అనీ, ఆయా దేశములందలి పల్లీజనుల ఆచార వ్యవహారములలో స్వతస్సిద్ధముగా సాగేకళ దేశి అనీ భరతముని చెప్పాడు. మార్గకు శాస్త్ర నిర్బంధాలెక్కువ. దేశికి స్వేచ్ఛఎక్కువ. ఈ విభజనమే తర్వాత వాఙ్మయంలోకికూడా ప్రాకి, సంస్కృత పండితులు నిర్దేశించిన లక్షణముల ననుసరించిగాని, సంస్కృత పాండిత్య సంపర్కము కలిగిగాని చేసిన రచనలకు మార్గ రచనలనీ, దేశములోని పామర జనులలో పారంపర్యగా వస్తుండే సహజ ధోరణి రచనలకు దేశి రచనలనీ పేరు వచ్చింది.

మధ్య యుగంలో సంగీతచరిత్ర పరిశీలిస్తే యక్షగానములలోని సంగీతమూ, భక్తి సంప్రదాయానికి చెందిన భజన సంకీర్తనాలలోని సంగీతమూ మధ్యయుగపు చివరి దశలోవచ్చిన జావళులలోని సంగీతమూ ఆనాటి లలిత సంగీత మున

వచ్చు. యక్షగానములలోని సంగీతరీతులే నేటి హరికథా కాలక్షేపాలలోని మట్లలో ఇంకా వినపడుతూంటాయి. యక్షగానములలోగాని, వారి కథలలోగాని వినవచ్చే దరువులలోని సంగీతం శాస్త్రీయపద్ధతి కీర్తనలలోని సంగీతంకంటె భిన్నమైనదికాదు. పాడే పద్ధతిలోని లాలిత్యంవల్లా, బహుజనాదరణంవల్లా అవి లలిత సంగీత పరిధిలోకి వస్తాయి. ఆనాటినుంచి నేటిదాకా మార్పు లేకుండా వస్తున్న జానపద గేయరీతులు మాత్రం నిత్యనిర్మలమైన లలిత సంగీతం. మధ్యయుగం గడిచి, ఆధునికయుగం ప్రారంభించేసరికి మన దక్షిణదేశంలో మరాటీ, పార్శీ, గుజరాతీ నాటక సమాజములవారి రాకతో మన లలిత సంగీతం కొత్త రూపురేకలు దిద్దుకోసాగింది. ప్రసిద్ధ ప్రాచీన కళయైన పురాణ కాలక్షేపములలోని తెలుగు పద్యముల గానపద్ధతి ఈ రంగస్థల నాటక సంగీతంలో ప్రత్యేక పరిణామమూ విశిష్టస్వరూపమూ సంపాదించుకొన్నది. నాటకాలలో ఆయా సందర్భాలకు అనుగుణముగా మరాటీ, పార్శీ, దేశముల సంప్రదాయాలకు అనురూపమైన సంగీతపు వరుసలెన్నో బయలుదేరాయి. మన ఆంధ్ర నాటకరచయితలు వాగ్గేయకర్తలు ఆ సంప్రదాయాలను మన సంప్రదాయముతో కలిపి ప్రత్యేక పరిణతికి తీసుకొచ్చి పాటలను అల్లుతూ పాడిస్తూవచ్చారు. అటువంటి రచయితల్లో పేరు కెక్కినవారు ధర్మవరం కృష్ణమాచార్యులు, బాపట్ల కాంతయ్యగార్లు.

ఆ తర్వాత వచ్చింది నవ్య సాహిత్యోద్యమం. స్వేచ్ఛ, సమానత్వము, విశ్వమానవ సౌభ్రాతృత్వము, ప్రణయము, ప్రకృతి ఆరాధన ఆదర్శములుగా గల గేయము లెన్నిటినో ఆధునిక కవులు వ్రాసి సభావేదికపై గానము చేస్తూ వచ్చారు.

గ్రామఫోన్ వచ్చింది, సినిమా వచ్చింది, రేడియో వచ్చింది. కవుల రచనలు హెచ్చాయి. హిందీ సినిమాలకు దేశం మొత్తంమీద కలిగిన కలిగిన ఆదరంవల్ల నాటకరంగపు రోజుల్లో కలిసిన బాణీలకు తోడుగా కలకత్తా, బొంబాయిలనుంచి వచ్చే సినిమాలద్వారా ఆ ప్రాంతాల బాణీలు విరివిగా మన లలిత సంగీతంలో కలుస్తూవచ్చాయి.

ఈ విధమైన సంగీతానికి సినిమా, గ్రామఫోనూ, రేడియో ఎంతో ప్రచారం కలుగజేశాయి. ప్రజాస్వామ్యయుగపు భావాలతో నవ్యచైతన్యం పొందిన దేశ ప్రజకి లలిత సంగీతంలోని ఈ నూతన పరిణామం అత్యంతాకర్షణీయమై అనతి కాలంలోనే ఆదరపాత్రమైపోయింది. సినిమాలలోను రేడియోలోను నిత్య నూతనాభిలాషులైన సంగీతకర్తల కృషివల్ల లలిత సంగీతం నానాటికి ప్రాంతీయ పరిధులను దాటిపోయి భారతదేశానికి అప్పటి సరిహద్దులలోని పారశీకం, దూరప్రాచ్యము మాత్రమే కాకుండా క్రమంగా పాశ్చాత్య దేశాలైన స్పెయిన్, అమెరికాల సంగీత పద్ధతులను కూడా తనలో కలుపుకోనసాగింది.

రేడియోలో మొదటినుంచీ తరచు జానపద గేయాలూ, రూపకములూ మాత్రమే కాకుండా "గీతావళి" అనే శీర్షికతో లలిత సంగీతపు బాణీలలో ఆధునిక కవుల గేయాలు వినిపిస్తూ వచ్చారు. అదిగాక ఆధునిక కవులు రచించిన గేయనాటకాలు తరుచు ప్రసారం అవుతూనే వున్నాయి. రేడియోలో ఈ కార్యక్రమాలలో పాడిపాడి పేరుపొంది, బయట కూడా పేరు గడించారు ఈనాటి మధుర గాయకు లెందరో!

తేలికతనం కోసమనీ, స్వేచ్ఛా, నవ్యత్వమూ, పేరు చెప్పి, విదేశ సంగీత రీతులలో, ముఖ్యంగా పాశ్చాత్య రీతులలో కొన్ని చవుకబారు పద్ధతులు మన దేశపు లలిత సంగీత రీతుల్లో చొప్పిస్తున్నారేమో అనీ, దీనికి ఏదో విధంగా ఒక అడ్డు వెయ్యకపోతే మన సంప్రదాయాలు నూతనత్వం పేరుతో వెర్రితలలు వేసి ప్రజాభిరుచిని అపమార్గం పట్టించవచ్చునని భయం మనలో చాలామందికి కలిగింది. అంతేకాకుండా ఆయా రాష్ట్రాలలో స్వతస్సిద్ధములై సహజ సంస్కృతిని వెల్లివిరిసే జానపద సంగీత సంప్రదాయాలు క్షీణించిపోకుండా వాటికి ప్రచారమూ నిలకడా కలుగజెయ్యాలనే సంకల్పం కూడా కలిగింది. శ్రావ్యమైన కంఠం కలిగి ప్రౌఢ సంగీతంలో తగిన కృషి చేయకకాని, చేసుకొని, భావయుక్తమైన లలిత గేయాలను పాడగల కళాకారులు అజ్ఞాతంగా ఎందరో ఉండిపోతున్నారు; అటువంటివారిని ఈ తేలికపద్ధతిలో కృషిచేయించడానికి తగిన

ప్రోత్సాహం కల్పించడంకూడా ఎంతైనా అవసరం. ఆయా రాష్ట్రాలలోని వివిధభాషలలోని జానపదగేయాలనూ, ఆధునిక కవి గేయాలనూ సేకరించి, వాటికి సంగీతఫణితులను కల్పించి, సమర్థులైన గాయకులచేత పాడించి, రికార్డు చేయించడానికీ, ప్రసారం చేయించడానికీ ఈ మధ్యనే భారతదేశములోని కొన్ని ముఖ్య రేడియో కేంద్రాలలో లలితసంగీత శాఖలను ఏర్పాటుచేశారు. ఈ శాఖలను ఢిల్లీ, బొంబాయి, కలకత్తా, అలహాబాదు, లక్నో, అహ్మదాబాదు, మద్రాసు, విజయవాడ కేంద్రాలలో ఏర్పాటు చేశారు. వివిధజంత్ర వాద్యములతో వాద్య బృందములూ వాటి నిర్వాహకులూ, గేయరచయితలూ, సంగీతకర్తలూ కలిసి ఒక్కొక్క దర్శకుని కింద ఈ శాఖలు పనిచేస్తున్నాయి.

రేడియోలో పాడేటప్పుడుగాని, రికార్డు చేసేటప్పుడుగాని లలితసంగీత నిర్వహణంలో చాలా సాధక బాధకాలున్నాయి. మొదట లయ ప్రస్ఫుటంగా, ఫణితి ఆకర్షణీయంగా, తిరిగి వెంటనే పాడుకోనేందుకు వీలుగా ఉండాలి. పాటలో భావం స్పష్టంగా ఉండేటట్టు మాటలు మధురమైన పదబంధంలో కూర్చాలి. పాటల కనువైన మాటలకూర్పు వచనాని కనువైన మాటల కూర్పుకంటె వేరుగా ఉంటుంది. ఛందస్సులో క్లిష్టతగాని, లయలో కష్టసాధ్యమైన పాండిత్యపు విరుపులుగాని ఉండకూడదు. రాగం భావానుగుణంగా పదాలవిరుపులకూ, ఊతానికీ అనువుగా వంపులు తిరుగుతూ పోవాలిగాని, రాగపు సంగతులవల్ల మాటల ఊనికగాని, మాటల విరుపులవల్ల రాగపు మెరుగులుగాని చెడకూడదు. ప్రౌఢసంగీత రచనలలో వాగ్గేయకారుడు కీర్తన రచించిన పద్ధతి ఏమో తెలియక పాడేవిద్వాంసులలో చాలామంది సాహిత్య ప్రాధాన్యమును పాటించకపోవడం ఎలాటిదో ఏమో, రాగమును చెడగొట్టేపద్ధతిని గేయమును ఫణితిలో పాడగడమూ అలాటి దోషమే. వాద్యగోష్ఠితో సహా గేయములు పాడేటప్పుడు వాద్యబృందము ఉపోద్ఘాతముగా కొంత సంగీతము వాయించిన తర్వాత పాటను అందుకోవడమూ, అందులోని చరణాలకూ చరణాలకూ నడుమ తిరిగి వాద్యబృందము వినిపించడమూ లలితగీతానికి తప్పని సరిఅయిన అలంకారంగా ఈనాడు ప్రజల్లో ప్రచారం పొందింది. అటువంటి సందర్భాలలో వాద్యబృందము పైని పాటకు ఉపోద్ఘాతముగా వచ్చే సంగీతం పాటలోని భావానికి కావలసిన పరిసర వాతావరణమును కల్పించేదిగా ఉండాలి. నాట్యం చేయవలసిన పాటకు విషాదసంగీతమూ, విషాద గీతానికి నాట్యలయాతంకమైన మర్దళ నాదాలూ ఉంటే దుస్సహంగా ఉంటాయి. "అనౌచిత్యాదృతే నాన్యద్రస భంగస్య కారణం" అని నాటక లక్షణకారుడు చెప్పిన సూత్రం ఏ కళా నిర్వహణకైనా వర్తిస్తుంది. ఇవన్నీ సమకూడిన మీదట శ్రావ్యమైన కంఠస్వరమూ, సమర్థులైన జంత్రగోష్ఠి అవసరం అవుతాయి.

సినిమాలలో విన్న పాటలకి ఆయా దృశ్యాల సంఘటనలూ, అక్కడి పాత్రల రూపాలు మొదలయిన మనోహర సన్నివేశాలు వాటి రసవత్తకి తోడ్పడతాయి గనుక ఆ విధమైన దృశ్య సాహాయ్యం ఏమాత్రం లేకుండా కేవలం శ్రవణాధారం మాత్రమే ఉండే లలిత గీతాలకు అంతటి ప్రజాదరం లభించదేమో అనే అభిప్రాయానికి తావులేకపోలేదు. అవయినా, ఇవయినా ఎక్కువ సార్లు వింటూండడంవల్లను లలితత్వంచేతనూ హృదయాన్ని ఆకర్షింపగలుగుతుంది.

దేశం మొత్తంమీద అన్ని ప్రధాన రేడియో కేంద్రాలలోనూ ప్రస్తుతం లలిత సంగీతాభివృద్ధి కోసం జరుగుతున్న ప్రత్యేకకృషి, మనదేశంలో ఇప్పుడు విరివిగా సాగుతున్న సాంఘికాభివృద్ధి ప్రణాలికలలో అతి ముఖ్యమైనదిగా భావించవచ్చును. ప్రతి రాష్ట్రంలోను అక్కడి సహజ సంస్కృతికి మూలకందమైన జానపద గీతులు హరించిపోకుండా సుస్థిర ప్రచారం సంపాదించుకొంటాయి. జానపద సంప్రదాయమూ, అక్కడి శాస్త్రీయ సంప్రదాయమూ సామరస్యం పొంది, నూతనత్వాన్ని కోసమని విదేశ రీతులను దాస్యభావంతో అనుకరించకుండా స్వేచ్ఛగా స్వసంప్రదాయాలను అనుసరించి ఆకర్షణీయమైన నవ్య సంగీత రీతులను సృష్టించుకోవచ్చు. వర్ధమానులై గేయరచన చేస్తున్న అనేక ఆధునిక కవుల కవితా సంపదకు ప్రజలంతా నిత్య భాగస్వాములు

కోవచ్చు. నగలలోను, దుస్తులలోను నాగరీకుల వేషభాషలు నిత్య నూతనత్వాన్ని సంతరించుకోవడంలో ప్రాతకాలపు అలంకరణ రీతులు తిరిగితిరిగి కొత్తదనం సంపాదించుకొని "నేటి ఫాషన్లు" అవుతున్నట్టుగా సంగీతమూ మొదలైన కళల్లో కూడా సంభవిస్తూ ఉంటుంది. అయితే ఇది చరిత్రలో చర్వితచర్వణమే అవుతుంది. గాని, అభివృద్ధిగా గణించడానికి వీలులేదు.

"ప్రవాహినీ భాషా" అని ప్రజల నిత్యవ్యవహారములో ఉండే భాష నిత్య ప్రవాహిని ఐన నదివంటిది అన్నారు లక్షణకర్తలు. ఈ ప్రవాహినికి పోనుపోను ఎన్నో ఉపనదులు చేరినప్పటికీ ముఖ్యనదిని ఆ పేరుతోనే పిలుస్తాము. అలాగే సామాన్య ప్రజల నిత్య వ్యవహారములో ఉండగల లలిత సంగీతాన్నికూడా నిత్య ప్రవాహినితో పోల్చవచ్చు. దాని స్వతస్సిద్ధ లక్షణాలు చెడకుండా ఆ ప్రవాహంలో ఎన్నో కొత్త ఉపనదులు జలాలు చేరుకోవచ్చు. అది ఎంతవరకు? వివిధ దేశాలమధ్య సంస్కృతీ రాయబారవర్గాలు నిత్యమూ రాకపోకలు సలుపుతూ తమతమ దేశీయ కళలను విదేశములలో ప్రదర్శిస్తున్న ఈ రోజులలో, మనం విదేశాలకుపోయి మన కళలను ప్రదర్శించేటప్పుడు ఆ విదేశముల పద్ధతులను మనము అనుకరించి చూపుతే వచ్చే ప్రకర్షకన్న మన కళలను సహజసిద్ధమైన పద్ధతులలో ప్రదర్శించినప్పుడు కలిగే ఉత్కర్షే ఎక్కువగా ఉంటోందని తెలుసుకోవాలి. అవిధంగానే మన భారతదేశంలోని వివిధ రాష్ట్రాలలోని కళాకారులు మనదేశపు ప్రధాన నగరాలలో తమ రాష్ట్రాలకు చెందిన సంగీతము మొదలైన కళలను ప్రదర్శించేటప్పుడు కూడా తమ సహజ కళారీతులను ప్రదర్శిస్తేనే రావలసిన మెప్పు వస్తుంది.

ఇప్పుడు రేడియో లలిత సంగీత శాఖలద్వారా జరుగుతున్న కృషివల్ల ఆయాభాషలకు సహజమైన రీతిని సలక్షణమైన లలిత సంగీతమూ, మధురగాయకులూ దేశమంతటా అభివృద్ధిచెంది, వివిధముఖముల భారతీయ సంస్కృతిలో అంతర్భూతమై ఉన్న ఏకత్వాన్ని ప్రకటించగలిగే శుభసమయానికి మనమంతా ఎదురు చూడవచ్చును.

త్రిశంకు నరకం

నడిమి బడుగు

కు. జానకిరాం పట్నాయక్

కాలం:-

టంగ్ - టంగ్ - టంగ్...గ్!
లేవోయ్! లేవోయ్! జడుడా!
మధ్యవర్గపు మానవుడా!
తొమ్మిదిసార్లు పిల్చినా
గమ్మున వుంటావ్?...ఇదేనా?

మానవుడు:-

ఆఁ?...ఆఁ?...తొమ్మిదైందా?
అరే?...కాలం...ఇంతవేగంగా గడిచిందా?
ఏమేవ్! కాఫీనీళ్ళయిందా?
ఆఫీసుకు పంపేది ఉందా?

భార్య:-

నిన్ననే చెప్పానుకదండీ
కాఫీగుండా చీనీ లేదని!
నన్నడిగితే ఏముందండీ?
ఆఫీసుకు పోతేపోండీ!

అబ్బాయి:-

నాన్నా!...నాన్నా!
నిన్ననే తన్నేరు మాష్టారు
బడి జీతం తీసుకెళ్ళలేదని!
ఈవేళైనా యివ్వండీ
ఇవ్వకపోతే పేరు తీసేస్తారండీ!

అమ్మాయి:-

పరికిణీ జుబ్బా శుభ్రంగా
చిరిగిపోయాయండీ నాన్నా!

మానవుడు:-

తన్నుకు చావండి దరిద్రులారా!
నన్ను వేధించకండి వెధవల్లారా!

Source: Press Academy Website, Telugu Swatantra Patrika, Oct 1954

Disclaimer: This topic/article/write-up has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan
http://www.maganti.org/